అవినీతి నిర్మూలనకు కృషి చేయాలి



కళాకారులను సన్మానిస్తున్న సంస్థ ప్రతినిధులు

సైదాబాద్‌: అవినీతిని నిర్మూలిస్తే ప్రపంచ దేశాల్లో మనదే ఉన్నతమైన దేశంగా నిలుస్తుందని వైఎస్‌ ఆర్‌ మూర్తి చారిటబుల్‌ ట్రస్ట్‌ చైర్మన్‌ వైఎస్‌ఆర్‌ మూర్తి పేర్కొన్నారు. ట్రస్ట్‌, హ్యాపీ ఫ్రెండ్‌ సర్కిల్‌ ఆఫ్‌ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం అవినీతిని సమాధి చేద్దాం అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో పలువురు కళాకారులు, ఔత్సాహిక రచయితలు పాల్గొని తమ కళా ప్రదర్శనలతో అలరించారు. ఈ సందర్భంగా వైఎస్‌ఆర్‌ మూర్తి మాట్లాడుతూ.. అక్రమ ప్రయోజనాలు పొందేందుకు అధికార దుర్వినియోగం చేయడానికి మూల కారణమైన అవినీతి ఎంతో నేరపూరితమైందన్నారు. అవినీతి కారణంగా దేశ ఆస్తులు, వనరులు కొల్లగొట్టబడ్డాయని అవినీతి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాకారులను సంస్థ ప్రతినిధులు సన్మానించారు. ఈ సమావేశంలో కామేశ్వరి, మృదుల, రామగౌడ్‌, సుమిత్ర, కోవెల, జనార్దన్‌, రేవతి, ఉదయలక్ష్మి పాల్గొన్నారు.

ధీరజ్‌రెడ్డిని అరెస్ట్‌ చేయాలని ఠాణా ముందు ఆందోళన

చైతన్యపురి: కాంట్రాక్ట్‌ పనులకు సంబంధించిన డబ్బులు అడగటానికి వెళ్లిన దాసరి హనుమయ్యపై దాడిచేసి అతడి అనుచరుడు భాస్కర్‌ను కులంపేరుతో దూషించిన ఆర్‌కెపురం కార్పొరేటర్‌ భర్త, ధీరజ్‌రెడ్డిని అరెస్ట్‌ చేయాలని సోమవారం చైతన్యపురి స్టేషన్‌ ముందు ఆందోళన చేపట్టారు. హనుమయ్య కూతురు దాసరి ఉష, బీఆర్‌ఎస్‌ నాయకుడు శంకరాచారి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు స్టేషన్‌ ముందు బైఠాయించి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఉష మాట్లాడుతూ.. డబ్బులు అడిగేందుకు వెళ్లిన తన తండ్రిని రక్తం వచ్చేలా కొట్టి దుస్తులు మార్చి బయటకు పంపించారని ఆరోపించారు. కేసు పెట్టినా పోలీసులు ఇంతవరకు అరెస్ట్‌ చేయకపోగా, తమపైనే కేసులు నమోదు చేయటం దారుణమన్నారు. దాడి సమయంలోని సీసీ ఫుటేజీ, రక్తపు దుస్తులను పోలీసులు



పోలీస్‌ స్టేషన్‌ ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం

వెంటనే సేకరించి ధీరజ్‌రెడ్డి, అతని అనుచరులను అరెస్ట్‌ చేయాలని కోరారు. సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్‌ అడిషనల్‌ డీసీపీ బి.కోటేశ్వరరావు, సరూర్‌నగర్‌ ఇన్‌స్పెక్టర్‌ సైదిరెడ్డి ఆందోళనకారులతో మాట్లాడారు. ధీరజ్‌రెడ్డిని విచారణ కోసం అదుపులోకి తీసుకుని ఏసీపీ కార్యాలయానికి తరలించామని చెప్పటంతో ఆందోళన విరమించారు.

నా వ్యక్తిగత వ్యవహారం.. పార్టీకి అంటకట్టడం సరికాదు



దిల్‌సుఖ్‌నగర్‌: సీతారామ ప్రాజెక్ట్‌కు కెనాల్‌ బ్లాస్టింగ్‌ కాంట్రాక్ట్‌ హనుమయ్యది కాదని, వేరొకరికి హనుమయ్య సబ్‌ కాంట్రాక్టర్‌ అని పనులు పూర్తి చేయకుండా డబ్బుల కోసం హనుమయ్య నాకు ఫోన్‌ చేసి బెదిరించాడని ధీరజ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్‌ అధ్యక్షులు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు రంగా నరసింహగుప్తా, బద్దం ప్రేమ్‌ మహేశ్వర్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. ఇది పూర్తిగా నా వ్యక్తిగత వ్యవహారానికి సంబంధించిన విషయమని దీన్ని బీజేపీ పార్టీకి అంట కట్టడం పద్ధతి కాదన్నారు. ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌ దీనికి రాజకీయ రంగు పులిమి హంగామా చేస్తున్నాడని ధీరజ్‌రెడ్డి ఆరోపించారు. బిల్లు రావాలంటూ హనుమయ్య కొంతమంది అనుచరులతో నా కార్యాలయంలోకి వచ్చి నాపై దాడికి దిగారని ఆరోపించారు.

మాదిగ మహిళా గర్జనను విజయవంతం చేయాలి

మలక్‌పేట: ఎస్సీలను ఏబీసీడీ వర్గీకరణ చేయాలని కోరుతూ ఈ నెల 29న ఇందిరా పార్కులో మాదిగ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'మాదిగ మహిళా గర్జన' విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్‌ టీఎస్‌ జాతీయ ప్రధాన కార్యదర్శి బట్టు దాసురావుమాదిగ, రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ గంట సుదర్శన్‌ మాదిగ పిలుపునిచ్చారు. మూసారంబాగ్‌లో సోమవారం మాదిగ మహిళా గర్జనకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణ చేయాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా వర్గీకరణ చేస్తామని చెప్పిన మాటకు కట్టుబడి ఉండాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య నాయకత్వం వర్గీకరణే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. మాదిగ, మాదిగ ఉపకులాల మహిళలు పెద్ద ఎత్తున గర్జనకు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమయ్య మాదిగ బి.లక్ష్మి, సైదమ్మ, సంతోషమ్మ, మాధురి, ప్రవళిక, పవర్ల, పెద్దసైదమ్మ, చక్కని, వెంకన్న, నాగేష్‌ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

పారా త్రోబాల్‌ పోటీల్లో చింటూరెడ్డి సత్తా



స్వర్ణం సాధించిన భారత్‌ జట్టు సభ్యులు

మన్సూరాబాద్‌: కంబోడియాలో ఈ నెల 4 నుంచి 7 వరకు జరిగిన పారా ఏషియన్‌ చాంపియన్‌ షిప్‌ త్రోబాల్‌ పోటీల్లో భారత్‌ స్వర్ణం సాధించింది. ఈ పోటీల్లో పాల్గొన్న జట్టులో సభ్యుడైన మన్సూరాబాద్‌ డివిజన్‌ శైలజాపురికాలనీలోని దివ్యాంగుల హాస్టల్లో ఉంటున్న గోనె చింటూరెడ్డి ప్రతిభ చాటాడు. దివ్యాంగుల హాస్టల్లో ఉండి చదువుకుంటూ క్రీడలపై మక్కువతో దేశానికి ప్రాతినిధ్యం వహించి అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నాడు. అంతర్జాతీయ పోటీల్లో దేశానికి స్వర్ణం పతకం సాధించారు. పారా క్రీడాలంటే ప్రభుత్వాలకు చిన్నచూపు ఉందని, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటున్నప్పటికి తమ సొంత ఖర్చులతో ప్రాతినిధ్యం వహించాల్సిన దుస్థితి గోనే చింటూరెడ్డి వాపోయాడు. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు సహాయం చేయాల్సిందిగా పలువురిని కోరినప్పటికి సహాయం అందలేదన్నారు. క్రీడపై ఉన్న మక్కువతో అప్పులు చేసి అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని దేశానికి బంగారు పతకం సాధించడం గర్వంగా ఉందన్నాడు. ఈ సందర్భంగా క్రీడాకారులను పారా క్రీడల ఏషియన్‌ సెక్రటరీ వివేషన్‌ అభినందనలు తెలిపారని వివరించారు.



గొనే చింటూరెడ్డికి ప్రశంసాపత్రం అందజేస్తున్న పారా క్రీడల ఏషియన్‌ సెక్రటరీ వివేషన్‌

అయ్యప్ప భక్తులకు నిత్య అల్పాహారం

సైదాబాద్‌: అయ్యప్ప మాలధారులకు మండల కాలం (41 రోజులు) పాటు ఉచితంగా చంపాపేటలో నిత్య అల్పాహార కేంద్రాన్ని ఏర్పాటు చేశామని పుల్లూరి ఉపేందర్‌గుప్తా గురుస్వామి తెలిపారు. నిత్య అల్పాహార కేంద్రంలో స్వాములకు సేవలు అందించే వారికి ఆయన అయ్యప్ప భక్తులతో కలిసి సన్మానించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. ఎస్వీ గ్రూప్‌ బిల్డర్స్‌ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నిర్వహించే ఈ కేంద్రంలో అయ్యప్ప స్వాములతో పాటు భవానీ మాత, ఆంజనేయ మాలధారణ చేసిన స్వాములకు సైతం సేవలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌యాదవ్‌, అనంతకృష్ణ, శ్రీనివాస్‌, శ్రీకాంత్‌గుప్తా, రవికుమార్‌ యాదవ్‌, బీరప్ప, మనోహర్‌, సుధీర్‌, శరత్‌చంద్ర పాల్గొన్నారు.



సేవకులను సన్మానిస్తున్న ఉపేందర్‌గుప్తా



- మలక్‌పేట సర్కిల్‌–6 పరిధిలో కుర్చీ కోసం కొట్లాట
- ఒకే పోస్టులో ఇద్దరు అధికారులు

ఇక్కడ ఏఎంహెచ్‌ఓ ఎవరబ్బా?

చాదర్‌ఘాట్‌: కిందిస్థాయి ఉద్యోగి మొదలుకుని ఉన్నతాధికారి వరకు ఏ పోస్టులోనైనా ఉద్యోగం ఒకరే చేస్తారు. మరి అదేం మాయాజాలమో.. మహేంద్రజాలమో తెలియదు కానీ.. జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్‌–6 పరిధిలో ఏఎంహెచ్‌ఓ పోస్టును ప్రస్తుతం ఇద్దరు అధికారులు నిర్వహిస్తున్నారు. అదేలా సాధ్యమంటే.. ప్రజాప్రతినిధి అండదండలుంటే జీహెచ్‌ఎంసీలో అన్నీ సాధ్యమే అని విమర్శలు గుప్పుమంటున్నాయి. జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్‌–6 ఏఎంహెచ్‌ఓగా అనురాధ విధులు నిర్వహిస్తున్నారు. నవంబర్‌ 7న ఆమెను ఫలక్‌నుమా సర్కిల్‌కు బదిలీ చేశారు. ఆమె స్థానంలో నూతనంగా ఉద్యోగంలో చేరిన రుద్ర శ్రీనివాస్‌కు తొలి పోస్టింగ్‌ ఇచ్చారు. అయితే ఫలక్‌నుమాకు బదిలీ ఉత్తర్వులు వచ్చినా అనురాధ మాత్రం ఇక్కడి కుర్చీని వదలటం లేదు. ఆమెకు బదిలీ అయినా ఎందుకు వెళ్లటం లేదనే ప్రశ్నకు స్థానిక ఎమ్మెల్యే ఆమెను రిలీవ్‌ చేయొద్దని మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు జీహెచ్‌ఎంసీలో గుసగుసలాడుతున్నారు.దీంతో జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్‌–6 ప్రస్తుత ఏఎంహెచ్‌ఓగా ఇద్దరూ విధులు నిర్వహిస్తున్న సందిగ్ధ పరిస్థితి నెలకొంది.

ఇద్దరికీ ట్విస్ట్‌...

అయితే ఉన్నతాధికారులు మాత్రం ఆ ఇద్దరు అధికారులకు ట్విస్ట్‌ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఒక పోస్టుకు ఒకరు విధులు నిర్వహించాల్సి ఉండగా, ఇద్దరూ అదే పోస్టులో కొనసాగుతుండటంతో వారికి గత నెల జీతాలను నిలిపివేశారని సమాచారం. దాంతో ఉద్యోగ జీవితంలో మొదటి నెల సంపాదన అందుకోలేక రుద్ర శ్రీనివాస్‌, బదిలీ అయినా వెళ్లని అనురాధ ఇద్దరూ తమ గత నెల జీతాన్ని అందుకోలేకపోవటం మరో ట్విస్ట్‌.

రైతు బజార్‌లో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్‌: సరూర్‌నగర్‌ రైతుబజార్‌లో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.23, వంకాయ రూ.23, బెండ రూ.28, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.23, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్‌ రూ.23, క్యాబేజీ రూ.18, క్యారెట్‌ రూ.53, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.35, ఉల్లిగడ్డ రూ.48, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.23, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.19, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.40, చామగడ్డ రూ.35, మునగ రూ.255, చిలుకడ దుంప రూ.55, బీట్‌రూట్‌ రూ.47, కీర రూ.24, బీన్స్‌ రూ.40, క్యాప్సికమ్‌ రూ.50. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

ప్రజావాణిలో శానిటేషన్‌పై ఫిర్యాదు

చాదర్‌ఘాట్‌: ప్రజావాణిలో శానిటేషన్‌పై ఫిర్యాదు వచ్చిందని మలక్‌పేట సర్కిల్‌–6 డీసీ జయంత్‌ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓల్డ్‌మలక్‌పేట కాగజ్‌ కార్ఖాణ గుడి పక్కనే అపార్ట్‌మెంట్‌ ఉందని గుడికి వచ్చే వారు అపార్ట్‌మెంట్‌ పక్కనే చెత్త వేస్తున్నారని ఫిర్యాదు అందిందని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీసీ తెలిపారు.

తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం సరికాదు

చంచల్‌గూడ: కాంగ్రెస్‌ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని ఇష్టం వచ్చినట్లు మార్చడం సరికాదని బీజేపీ జాతీయ కౌన్సిల్‌ సభ్యుడు, మాజీ కార్పొరేటర్‌ సహదేవ్‌యాదవ్‌ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్ద కాలం నుంచి రాష్ట్ర ప్రజల మనసులో ఉన్న రూపాన్ని అకస్మాత్తుగా మార్చడం ఉద్దేశం ఏంటని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీల అమలు మరిచి ఇతర అంశాలపై సమయం వృథా చేస్తున్నారన్నారు.

బస్సు ఆపలేదని అద్దాలు ధ్వంసం

వ్యక్తిపై కేసు నమోదు

లింగోజిగూడ: బస్సు ఆపలేదని అద్దాలు ధ్వంసం చేయడంతో పాటు సిబ్బందితో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదైన ఘటన హయత్‌నగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హయత్‌నగర్‌–2 డిపోకు చెందిన బస్సు(ఏపీ29జెడ్‌5462) బాచారం నుంచి అఫ్జల్‌గంజ్‌కి హయత్‌నగర్‌ మీదుగా వెళ్తుంది.సోమవారం ఉదయం 9 గంటల సమయంలో హయత్‌నగర్‌ బస్టాండ్‌ సమీపంలో కుంట్లూర్‌కు చెందిన సతీష్‌రెడ్డి బస్సును అడ్డగించి కుంట్లూరులో బస్సు ఎందుకు ఆపలేదని డ్రైవర్‌,కండక్టర్‌ను తిట్టి తనవెంట తెచ్చుకున్న కర్రతో బస్సు అద్దాలు ధ్వంసం చేశాడు. డ్రైవర్‌, కండక్టర్‌ భీమ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఎగ్జిబిషన్‌కు ఆదరణ



మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్‌ ఇండియా హ్యాండ్లూమ్‌, హ్యాండీక్రాఫ్ట్‌ మేళా (ఎగ్జిబిషన్‌ అండ్‌ సేల్‌)కు విశేష ఆదరణ లభిస్తోంది. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్‌, డిజైనర్‌, కాంతా వర్క్‌, హ్యాండ్‌ బ్లాక్‌ ప్రింటెడ్‌, లినెన్‌, కలంకారీ, బెంగాల్‌ కాటన్‌, లక్నో చికాన్‌, బనారస్‌ చీరలు, లేడీస్‌ ఫ్యాన్సీ టాప్స్‌, డిజైనర్‌ బ్లౌజెస్‌, ఖాదీ మెటీరియల్‌, కొండపల్లి బొమ్మలు, తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని నిర్వాహకులు అక్బర్‌అలీ తెలిపారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్‌ భూపతి గట్టుమల్లు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అర్జున్‌

హస్తినాపురం: ట్రాఫిక్‌ నిబంధనలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవని వనస్థలిపురం ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ భూపతి గట్టుమల్లు సూచించారు. విజయవాడ జాతీయ రహదారి చింతల కుంట వద్ద సోమవారం వాహనాల తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ రహదారులపై వాహనాలను నిలుపరాదని, ట్రాఫిక్‌ మళ్లింపు ప్రాంతాలలోనే మలుపు తిప్పుకోవాలన్నారు. రాంగ్‌రూట్‌లలో వెళ్తే ప్రమాదాలు జరుగుతాయన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. వాహనాలకు బ్లాక్‌స్టిక్కర్లను అంటించరాదన్నారు.

విద్యార్థులకు అవగాహన..

నాగోలు: విద్యార్థులందరూ ట్రాఫిక్‌ నిబంధనలు తెలుసుకోవాలని రాచకొండ ట్రాఫిక్‌ ట్రైనింగ్‌ ఇనిస్టిట్యూట్‌ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్‌ అర్జున్‌ తెలిపారు. సోమవారం రాచకొండ పరిధిలోని వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాచకొండ పిల్లల ట్రాఫిక్‌ శిక్షణ పార్కును సందర్శించగా వారికి ట్రాఫిక్‌ నిబంధనలపై అవగాహన కల్పించారు. హెల్మెట్‌ ప్రాధాన్యతను వివరిస్తూ వీడియో క్లిప్స్‌ ప్రదర్శించారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిద్దాం



మాట్లాడుతున్న భాస్కర్‌

మన్సూరాబాద్‌: దేశంలో బీజేపీ మతోన్మాదులను రెచ్చగొటి కష్టజీవులను విడదీస్తుందని, కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిద్దామని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కడిగల భాస్కర్‌ పిలుపునిచ్చారు. మన్సూరాబాద్‌ డివిజన్‌ జడ్జెస్‌కాలనీ కమ్యూనిటీహాల్లో సోమవారం నిర్వహించిన సీపీఎం హయత్‌నగర్‌ సర్కిల్‌ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతర్జాతీయ మార్కెట్‌లో డీజిల్‌, పెట్రోల్‌ ధరలు తగ్గుముఖం పట్టినా కేంద్ర ప్రభుత్వం ధరలు తగ్గించటం లేదని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్‌ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. నిత్యావసరాల ధరలు నిత్యం పెరుగుతుండటంతో పేదలు జీవనం సాగించలేని స్థితిలో ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయటంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయలేక అనవసరపు మాటలతో కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కీసరి నర్సిరెడ్డి, సభ్యులుగా సీహెచ్‌ కృష్ణయ్య, మల్లేషం, భాస్కర్‌, సంధ్య, కొత్త గణేష్‌గౌడ్‌, కృష్ణారెడ్డి, అనిల్‌రెడ్డి, కనకయ్య ఎన్నికయ్యారు.

వ్యక్తి అదృశ్యం

లింగోజిగూడ: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన హయత్‌నగర్‌ పోలీస్టేషన్‌ పరిధిలోని చోటు చేసుకుంది. హయత్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని కట్ట మైసమ్మ కాలనీలో నివాసముండే ఐనల యాకయ్య మేస్త్రీ పని చేస్తుంటాడు. ఈ నెల 5న ఉదయం పనికి వెళ్లి రాత్రైనా ఇంటికి రాలేదు. చుట్టు పక్కల, బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో భార్య రమాదేవి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పర్యవేక్షణ లోపం.. పనులు నాసిరకం



ధ్వంసమైన మ్యాన్‌హోల్‌



కొత్తగా వేసిన రోడ్డులో కుంగిన మ్యాన్‌హోల్‌

హస్తినాపురం: అధికారుల పర్యవేక్షణ లేక అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తుందని వివిధ కాలనీలవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎల్‌బీనగర్‌ సర్కిల్‌ హస్తినాపురం డివిజన్‌ పరిధిలోని అనేక ప్రాంతాల్లో చేపట్టిన పనులు నాసిరకంగా ఉన్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేక ఈ దుస్థితి నెలకొందని నార్త్‌ ఎక్స్‌టెన్షన్‌ కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో కొన్ని రోజులకే ధ్వంసం అవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హస్తినాపురం నార్త్‌ ఎక్స్‌టెన్షన్‌ కాలనీలో ఇటీవల వేసిన బీటీ రోడ్డు పనులు సక్రమంగా వేయలేదని నిబంధనలు పాటించకపోవడంతో నడి రోడ్డులో డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ మూత పూర్తిగా ధ్వంసమై ప్రమాదకరంగా మారిందన్నారు. రోడ్డు వేసి దాదాపు 20 రోజులు అవుతున్నా డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను సరిచేయకపోవడంతో చిన్న పిల్లలు అందులో పడిపోయే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఒక వైపు నాసిరకం పనుల కారణంగా రూ. లక్షల్లో ప్రజా ధనం వృథా చేస్తుంటే దగ్గరుండి పనులు చేయించాల్సిన సంబంధిత అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌ ఇష్టానుసారంగా చేస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నాగోలు: ఆరోగ్యం పట్ల అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని అవేర్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌, కటకం నర్సింగ్‌రావు అన్నారు. నాగోలు డివిజన్‌ పరిధిలోని జైపూరికాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో సుప్రజ ఆస్పత్రి సహకారంతో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని నర్సింగ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆహార అలవాట్లు మార్చుకోవాలని సూచించారు. ఆరోగ్య పరిరక్షణకు నిత్యం కొంత సమయం కేటాయించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చిరంజీవి, యాదగిరి, అశోక్‌ వేణుగోపాల్‌, వెంకట్‌ రెడ్డి, దాక్షారావ్‌, కిరణ్‌, రాఘవాచారి పాల్గొన్నారు.

'ప్రజా సంక్షేమం విస్మరించిన కాంగ్రెస్‌'



సురేందర్‌రెడ్డి

మలక్‌పేట: కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రజా సంక్షేమం విస్మరించిందని బీజేపీ భాగ్యనగర్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలో వచ్చిన కాంగ్రెస్‌, వాటిని అమలు చేయడంలో విఫలమైందన్నారు. కనీస సౌకర్యాలు అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధ్వానంగా మారిన రోడ్లు, పార్కులను పట్టించుకోవడం లేదన్నారు. ప్రజా పాలన–ప్రజా విజయోత్సవాలు జరుపుకుంటున్న కాంగ్రెస్‌ ముందు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలన్నారు.

ఉచితంగా విద్య, వైద్యం అందించాలి



సభ్యతం అందజేస్తున్న దృశ్యం

దిల్‌సుఖ్‌నగర్‌: రాష్ట్రంలోని ప్రజలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించాలని విద్యార్థుల రాజకీయ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇజ్జగిరి కమలాకర్‌ అన్నారు. సోమవారం ఆర్‌కేపురం డివిజన్‌ అల్కాపురి కమ్యూనిటీ హాల్‌ వద్ద పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పేద సంక్షేమ కోసం, అందరికి విద్య, వైద్యం అందించడమే లక్ష్యంగా విద్యార్థుల రాజకీయ పార్టీ పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్‌ గోకికర్‌, నందల అనిల్‌కుమార్‌, మహేష్‌, భాగవతుల, యెచ్చు అనిల్‌కుమార్‌, పాక నవీన్‌, బాబు, కథలయ్య పాల్గొన్నారు.

ఘనంగా గురు దత్తాత్రేయ జయంతి



దిల్‌సుఖ్‌నగర్‌: ఆర్‌కేపురం డివిజన్‌లోని అల్కాపురి శృంగేరి శంకర మఠంలో గురు దత్తాత్రేయ జయంతి మహోత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో గణపతిపూజ, విశేష మండపారాధన, అర్చన, సామూహిక సప్తాహ శ్రీ గురుచరిత్ర పారాయణం, శ్రీ సత్యదత్త వ్రతం శ్రీదత్త భావసుధారస తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యార్థులకు ఇబ్బందులు రానివ్వొద్దు

మలక్‌పేట: సైదాబాద్‌ మండల తహసీల్దార్‌ జయశ్రీ సోమవారం మూసారంబాగ్‌ కృష్ణతులసి నగర్‌ బీసీ బాలుర హాస్టల్‌ను సందర్శించారు. హాస్టల్‌ గదులు, వంటగది, బియ్యం, ఆహార వస్తువులు, విద్యార్థుల హాజరు రిజిష్టర్‌ను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్‌లో భోజనం చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని వార్డెన్‌కు సూచించారు.



హాస్టల్‌లో భోజనం చేస్తున్న తహసీల్దార్‌ జయశ్రీ

పాఠశాలకు కేటాయించిన స్థలంలో చదును

అడ్డుకున్న గ్రామస్తులు

నాగోలు: నాగోలు డివిజన్‌ పరిధిలోని బండ్లగూడ ప్రభుత్వ పాఠశాలకు కేటాయించిన స్థలంలో వివాదంలో ఉన్న 278 గజాల స్థలాన్ని గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి జేసీబీతో చదును చేస్తుండగా విషయం తెలుసుకున్న పాఠశాల పరిరక్షణ సమితి నాయకులు అక్కడకు చేరుకుని పనులను అడ్డుకున్నారు. యత్నం చేశారు. కబ్జాదారులు గతంలో ఉన్న స్థలం ఆనవాళ్లు లేకుండా రాత్రి సమయంలో పనులు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయమై పాఠశాల పరిరక్షణ సమితి నాయకులు, నాగోలు పోలీసులు, విద్యాశాఖ అధికారులు ఫిర్యాదు చేశామన్నారు.



రాత్రి సమయంలో జేసీబీతో చదును చేసిన దృశ్యం